
సాక్షి
బాపట్ల
శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఓటింగ్ మిషన్ల తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. డీఆర్వో ఎ.మురళి పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 573.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,678 క్యూసెక్కులు వదిలారు.



ఈవీఎంల పరిశీలన

బాపట్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

జెస్సీ రాజ్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బాలపురస్కార్ అవార్డు అందుకున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. న్యూఢిల్లీలో అవార్డు స్వీకరించిన తర్వాత జెస్సీ రాజ్ మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు పలువురు క్రీడా సంఘ పెద్దలు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

31 వరకు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యం ఈనెల 26 నుంచి 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని వివరించారు. వచ్చిన అభ్యంతరాలను 2025 జనవరి 6న క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని ఆమె పేర్కొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మోటారు సైకిళ్లను నడపాలని ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు. హెల్మెట్ వాడకంపై అవగాహన నిమిత్తం పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద మోటారు సైకిళ్ల ర్యాలీని శుక్రవారం ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఇబ్బందులు తప్పవని చెప్పారు. హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడిపితే అన్ని విధాలా ఉపయోగకరమని చెప్పారు. పోలీసులు హెల్మెట్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శివకుమార్ కేసు వచ్చేనెల 16కి వాయిదా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తోపాటు 18 మందిపై నమోదైన కేసును వచ్చేనెల 16కు న్యాయమూర్తి వాయిదా వేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్లిన సందర్భంగా జరిగిన ఘటనపై ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు శివ కుమార్‌తోపాటు మరో 18 మందిపై తెనాలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కేసు కావడంతో గుంటూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. శుక్రవారం ఈ కేసు విచారణ చేపట్టిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వచ్చేనెల 16కు వాయిదా వేశారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ తరపున బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బార్ మాజీ అధ్యక్షుడు పాలూరి వెంకటరెడ్డి, న్యాయవాదులు జి.కృష్ణారావు, మొండితోక శ్రీనివాసరావు వకాల్తీ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రతిభావంతులైన విద్యార్థులు తయారవుతున్నారని సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అర్షియా ఫాతిమాను శుక్రవారం ఆమె అభినందించారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థిని అర్షియా ఫాతిమా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంతో పాటు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

కూటమి బాదుడుపై కన్నెర్ర!

కూటమి బాదుడుపై వైఎస్సార్ సీపీ కదన భేరి మోగించింది. విద్యుత్ చార్జీల పేరిట అడ్డగోలు వసూలుపై కన్నెర్ర చేసింది. ప్రజలతో కలిసి పోరుబాట పట్టింది. పెంచిన విద్యుత్తు చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేసింది. ప్రజల నడ్డి విరిచేలా వ్యవహరిస్తున్న కూటమి తీరుపై మండిపడింది. పేదలు, మధ్యతరగతిపై పెనుభారం మోపిన పాలకుల తీరును ఎండగట్టింది. నిరసన గళం వినిపించి ప్రజాపక్షమై కూటమి సర్కార్ వైఖరిని ఖండించింది.

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆందోళనలు

- అన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు
- పెంచిన చార్జీలు తగ్గించాలని అధికారులకు వినతిపత్రాలు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు అన్నివర్గాల నుంచి భారీ మద్దతు
- కూటమి సర్కార్ తీరుపై అన్నిచోట్ల పెల్లుబికిన ప్రజాగ్రహం



విద్యుత్ చార్జీల పెంపుపై వేమూరులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వరికూటి అశోక్‌బాబు తదితరులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలనే డిమాండ్‌తో వైఎస్సార్ సీపీ శుక్రవారం చేపట్టిన ఆందోళన హోరెత్తింది. ఉదయం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పార్టీ సమన్వయ కర్తల ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలకు శ్రేణులతో పాటు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ ర్యాలీలు చేపట్టారు. విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి నినదించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసినట్లుగా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు ఇకనైనా నడుచుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన ఆందోళనకు అన్నివర్గాల నుంచి మద్దతు లభించింది.

బాపట్లలో

మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆందోళనలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు. ఉదయం రథం బజారులోని కోన భవన్ నుంచి విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినదించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఎస్ఈ ఆంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు.



రేపల్లెలో నిరసన కార్యక్రమంలో డాక్టర్ ఈవూరు గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు



బాపట్లలో ఎస్ఈ ఆంజనేయులుకు వినతి పత్రం అందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

వేమూరులో

పార్టీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో భారీసంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు స్థానిక రైల్వే గేటు నుంచి విద్యుత్ ఏఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు.

రేపల్లెలో

సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇసుకపల్లిలోని విద్యుత్ డీఈ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చీరాలలో

సమన్వయకర్త కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తొలుత రామకృష్ణాపురం నుంచి వీఆర్‌ఎస్ కళాశాల వరకు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత విద్యుత్ డీఈ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం ఏడీకి వినతిపత్రం సమర్పించారు.

పర్చూరులో

సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎస్సీ కాలనీలో వైఎస్సార్ విగ్రహం నుంచి విద్యుత్ ఏఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

అద్దంకిలో

సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి శింగరకొండ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అధికారులకు వినతి పత్రం సమర్పించారు. విద్యుత్ శాఖ కార్యాలయం ప్రధాన గేటుకు ఇరువైపులా వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా ఉన్న వ్యాఖ్యలతో గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పానెం చిన హనిమిరెడ్డి తెలిపారు.

ఈ ఆందోళన కార్యక్రమాల్లో పార్టీ నేతలు జాన్సీ, లీలా శ్రీనివాసరెడ్డి, డేవిడ్, కోకి రాఘవరెడ్డి, విజయకుమార్, ఏడుకొండలు, రఘురామిరెడ్డి, మోహన్‌రెడ్డి, పద్మారావు, జంజనం శ్రీనివాసరావు, గొని శ్రీనివాసరావు, వెంకట్రావు, అరుణ్, భాస్కర్ రావు, కొల్లా వెంకట్రావు, కటారి అప్పారావు, ప్రభాకరరావు, నాగేశ్వరరెడ్డి, జ్యోతిహనుమంతరావు, రాధాకృష్ణమూర్తి, కరేటి శేషగిరి, మేడికొండ అనిల్, ఇంకొల్లు రామకృష్ణ, బగ్గా రెడ్డి, చిమటా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో ర్యాలీ చేస్తున్న కరణం వెంకటేష్, నేతలు, కార్యకర్తలు



బాపట్లలో విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, నాయకులు



చీరాలలో విద్యుత్ కార్యాలయ గేటు వద్ద నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



అద్దంకిలో డీఈ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న పానెం చిన హనిమిరెడ్డి, నేతలు, కార్యకర్తలు



పర్చూరులో ర్యాలీగా వస్తున్న సమన్వయకర్త యడం బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు

తమ్ముళ్ల మధ్య ఇసుక 'ఫైర్'

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఇసుక, భూములు, మద్యం, అక్రమ వ్యాపారాల్లో తెలుగు తమ్ముళ్లు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. వాటాలు వేసుకుని ప్రకృతి వనరులను పప్పుబెల్లాల్లా పంచుకుని దండుకుంటున్నారు. చీరాల కేంద్రంగా ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ నాయకులే ఈ తతంగం నడిపిస్తుండటంతో పోలీసులు, మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తూ జీ హుజూర్ అంటోంది. ఇప్పుడు ఇది కాస్తా వాటాలు కుదరక తెలుగు తమ్ముళ్ల మధ్య 'ఫైర్' రాజేసింది. ఒకరు ఎంపీ అనుచరుడు కాగా.. మరొకరు ఎమ్మెల్యే వర్గంలోని వ్యక్తి కావడం గమనార్హం.



పెట్రోల్ పోసి తగులబెట్టిన జేసీబీ

- అక్రమ తవ్వకాలతో అడ్డగోలుగా సంపాదిస్తున్న బాపట్ల ఎంపీ అనుచరుడు
- తనకూ వాటా కావాలని టీడీపీ ఎమ్మెల్యే వర్గంలోని వ్యక్తి డిమాండ్
- ఒప్పందం కుదరక ఇరువర్గాల మధ్య కొన్ని రోజులుగా ప్రచ్ఛన్న యుద్ధం
- ఎంపీ అనుచరుడు రామకృష్ణకు చెందిన క్వారీ వద్ద జేసీబీ దహనం
- ఎమ్మెల్యే వర్గంలోని జితేందర్ పనేనంటూ పోలీసులకు ఫిర్యాదు

చీరాల: ప్రభుత్వ లెక్కల ప్రకారం చీరాల రూరల్, వేటపాలెం మండలం, చినగంజాం ప్రాంతాల్లో ఇసుక సమృద్ధిగా ఉంటుంది. అయితే అవన్నీ ప్రైవేటు, అసైన్డ్ భూములు కావడంతో ఏ ఒక్కరికీ అనుమతి లేదు. కానీ రోజుకు 500 ట్రాకర్ ట్రక్కులు, 200 లారీల ఇసుక పట్టపగలే తరలిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇసుక నిరంతరం తవ్వడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. చీరాలంటే ఇసుక ప్రాంతం అనే పరిస్థితి పోయి ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను కొనుగోలు చేసే స్థాయికి చేరింది. ఇదంతా టీడీపీ నాయకులు, పెద్దల కనుసన్నల్లోనే జరగడం వారి అక్రమార్జనకు అడ్డంపడుతోంది. ప్రాంతాల వారీగా విభజించి మరీ ఇసుకను తవ్వుతూ జేబులు నింపుకొంటున్నారు.

టీడీపీ నేతల మధ్య వాటాల గొడవలు

దీంతో ఇప్పటికే ఇసుక మాఫియా మధ్య అనేక వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే సమస్య జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి వెళ్లింది. చివరికి ఇసుక వాటాలు పంచుకునే విషయంలో ఘర్షణలు తీవ్ర రూపం దాల్చి జేసీబీలను తగలబెట్టుకున్న ఘటన చీరాల రూరల్ మండలం బోయినవారిపాలెంలో చోటు చేసుకుంది. ఈపురుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెం శివారులో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వుకుంటూ సొమ్ము చేసుకుంటారు. ఒక్కో ట్రక్కు రూ.4 వేల చొప్పున విక్రయిస్తున్నారు. బాగా లాభసాటిగా ఉండటంతో కొద్దినెలలు ఇసుక వ్యాపారం చేస్తే జీవితం సెటిల్ అవుతుండటంతో టీడీపీ నేతలు చాలామంది దృష్టి సారించారు. చాలాకాలంగా ఇ.రామకృష్ణ జేసీబీలతోపాటు సొంత ట్రాక్టర్లు ద్వారా ఇసుకను చీరాల, బాపట్ల వైపు తరలిస్తున్నారు. ఈయన బాపట్ల టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అనుచరుడుగా పేరొందారు. జితేందర్ అనే వ్యక్తి కూడా ఇసుక వ్యాపారం చేస్తుంటారు. చీరాల టీడీపీ ఎమ్మెల్యే కొండయ్యకు సంబంధించిన వ్యవహారాలు చూసే రాజేష్‌రెడ్డికి ఈయన అనుచరుడు. ఇసుక అక్రమ రవాణాలో ఇరువురు మధ్య కొంతకాలంగా మంచి సంబంధాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రామకృష్ణ క్వారీల్లో తనకు కూడా భాగస్వామ్యం ఇవ్వాలని జితేందర్ పోటీపడుతున్నారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. చర్చలు కూడా జరిగాయి. అయినా రామకృష్ణ ససేమిరా అన్నారని సమాచారం. దీంతో శుక్రవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో రామకృష్ణకు చెందిన క్వారీ వద్ద నిలిపి ఉంచిన జేసీబీని సుమోలో వచ్చిన వారు పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ ఘటన చీరాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఇసుక వివాదాలు ఎక్కడి వరకు దారి తీస్తాయోనని బోయినవారిపాలెం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జేసీబీ దహనంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చీరాల రూరల్ సీఐ పి.శేషగిరిరావు, రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీలు చూసి తగిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



విచారణ చేస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్

టీచర్లకు 'వంట' తంటా

ఎంఈవో తనిఖీలో బహిర్గతం



కేజీబీవీలో పరిశీలిస్తున్న ఎంఈవో

బల్లికురవ: కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థను ఎలా నాశనం చేసిందో మనందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసి విద్యార్థులను ఇబ్బందులు పెడుతోంది. ఇందుకు నిదర్శనంగా మరో ఘటన నిలిచింది. మండలంలోని గురుకుల బాలికల విద్యాలయంలో వంట కార్మికులు లేకపోవడంతో ఉపాధ్యాయినులే వంట చేస్తున్నారంటే ఆశ్చర్యం వేయక మానదు. శుక్రవారం బల్లికురవలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఎంఈవో-2 కే రమేష్‌బాబు మధ్యాహ్న భోజనం అమలు తీరును తనిఖీ చేశారు. అక్కడ ఉపాధ్యాయినులే భోజనం వడ్డించడం చూసి విస్తుపోయారు. వంట కార్మికులు 20 రోజులుగా విధులకు గైర్హాజరైన విషయంపై జిల్లా స్థాయి అధికారులకు నివేదిస్తానన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 244 మంది బాలికలు ఇక్కడ విద్య అభ్యసిస్తున్నారు. నలుగురు వంట కార్మికులు ఉండేవారు. ఇటీవల ఒకరు చనిపోగా, మరొకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన ఇద్దరూ గైర్హాజరు అయ్యారు. బాలికలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయినులే వంట వారి పాత్ర కూడా పోషిస్తూ వండి, వడ్డిస్తున్నారు. విషయాన్ని విద్యాలయ ప్రిన్సిపల్ కూడా గతంలో ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఫలితం మాత్రం ఇంతవరకు లేదు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

అద్దంకి రూరల్/మేదరమెట్ల: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. శుక్రవారం అద్దంకి, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్రైం రికార్డులను పరిశీలించారు. పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్, అద్దంకి సీఐ పి. కృష్ణయ్య, మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భట్టిప్రోలు వాసికి స్వర్ణ నంది పురస్కారం



భట్టిప్రోలు: తెలుగు సాహిత్యంలో ప్రతిభ చాటుతున్న భట్టిప్రోలుకు చెందిన కవయిత్రి దొంతు ప్రభావతికి స్వర్ణ నంది పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన కళా నిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ నిర్వాహకులు ఎ. సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అబిడ్స్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రభావతి అందుకున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



చీరాల: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చీరాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేరాలలో అరుణ్ ఐస్‌క్రీమ్ ఎదురుగా గురువారం రాత్రి సుమారు 65 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడి వెళ్లి పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యం కాలేదని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలుడిపై కత్తితో దాడి

బెల్లంకొండ: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమనడంతో బాలుడిపై కత్తితో దాడికి పాల్పడి గాయపరిచిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొజ్జా శ్రీనివాసరావు(17) వద్ద అదే గ్రామానికి చెందిన మన్నేపల్లి పిచ్చయ్య కొద్దిరోజుల కిందట రూ.200 అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడంతో ఇరువురి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో గ్రామంలోని మద్యం దుకాణం వద్ద కనిపించడంతో పిచ్చయ్యను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న పిచ్చయ్య శ్రీనివాసరావు మెడపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కష్టానికి ఫలితం దక్కేనా ?!

- 30న గుంటూరులో దేహదారుఢ్య పరీక్షలు
- అకస్మాత్తుగా ప్రకటించడంతో కానిస్టేబుల్ అభ్యర్థుల్లో ఆందోళన
- సన్నద్ధతకు తగిన సమయం ఇవ్వలేదంటున్న అభ్యర్థులు
- ప్రాక్టీసు చేసుకునేందుకు సరైన క్రీడా మైదానాలూ కరవు



ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూలులో వాకర్స్ మధ్య పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు

చీరాల రూరల్: పోలీసు ఉద్యోగం చేసేందుకు యువత ఉవ్విళ్లూరుతున్నారు. పోలీసు, ఆర్మీ, నేవీ, బీఎస్ఎఫ్, ఏపీఎస్పీ, సీఐఎస్ఎఫ్ వంటి ఉద్యోగాల కోసం యువకులు ఎగబడుతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేస్తే అర్హులు కావడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంఏ, ఎంబీఏ వంటి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులు కూడా క్యూ కడుతున్నారు.

నిరంతరం సాధన

పోలీసుల ఉద్యోగాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీలను భర్తీ చేసేందుకు పోలీసు డిపార్టుమెంట్ నోటిఫికేషన్ వేయగా నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యారు. ఈవెంట్స్ కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 5,600 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఈవెంట్స్ పూర్తయిన అనంతరం మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను చివరిగా ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అభ్యర్థులు పోలీసు ఉద్యోగం సంపాదించేందుకు అరకొర సౌకర్యాల నడుమ నిరంతరం కష్టపడుతున్నారు. రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్ వంటి ఈవెంట్స్‌ను నిరంతరం క్రీడా మైదానాలలో ప్రాక్టీసు చేస్తున్నారు. చలిని లెక్క చేయకుండా లక్ష్యంపై దృష్టి సారించారు.

క్రీడా మైదానాలు కరవు..

అభ్యర్థులు విజయం సాధించాలంటే మంచి క్రీడా మైదానాలు ఉండాలి. చీరాలలోగానీ, జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఆ దాఖలాలులేవు. చీరాలలో గతంలో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో మైదానం ఉండేది. ప్రస్తుతం కాలేజీ పర్యవేక్షణ మొత్తం యలమంచిలి గ్రూప్‌నకు ఇచ్చేశారు. ఉన్న ఒక్క క్రీడా మైదానానికి యలమంచిలి గ్రూప్ క్రీడాకారులను రానీయడం లేదు. తాళాలు వేసి పూర్తిగా మూసివేశారు. దీంతో అభ్యర్థులు ప్రాక్టీసు చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూలు, ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూళ్లలో క్రీడా మైదానాలు ఉన్నా అరకొర సౌకర్యాలే దిక్కు. క్రీడాకారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మైదానాలు అందుబాటులోకి తేవాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

లక్ష్య సాధనపై దృష్టి అవసరం



నేటి యువత చెడు వ్యసనాలు విడనాడి మంచి మార్గంలో నడవాలి. లక్ష్య సాధనపై దృష్టి సారించాలి. పోలీసు, ఆర్మీ వంటి డిఫెన్స్ ఉద్యోగాలు రావాలంటే మంచి ప్రవర్తన కలిగి ఉండాలి. అభ్యర్థులపై ఎటువంటి పోలీసు కేసులు ఉండకూడదు. మంచి మార్గంలో నడుస్తూ, చక్కగా చదువుకోవాలి.

– ఎండీ మెయిన్, డీఎస్పీ, చీరాల

గతంలో అరమార్కుతో ఉద్యోగం మిస్



పోలీసు కావాలనే లక్ష్యంతో గతంలో జరిగిన పరీక్షలకు హాజరయ్యా. కేవలం అర మార్కుతో పోలీసు ఉద్యోగం కోల్పోయాను. నా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా నిలుస్తాను.

–పెర్ల హేమంత్, పెర్లవారిపాలెం

తప్పకుండా విజయం సాధిస్తా



మాది ఈపురుపాలెం. చేనేత కుటుంబం. గతంలో జరిగిన పోలీసు పరీక్షలో ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయా. ఈ సారి తప్పకుండా ఉద్యోగం సాధిస్తాను. చీరాల వాడరేవుకు చెందిన పులుగు ధనుంజయ శ్రీనివాసుల రెడ్డి వద్ద శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోంది.

– భాను, ఈపురుపాలెం

సరైన సౌకర్యాలు లేవు



శిక్షణ తీసుకునేందుకు చీరాలలో క్రీడా మైదానాలు సక్రమంగా లేవు. ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూలు ఒక్కటే క్రీడాకారులకు దిక్కు. క్రీడాకారులే కాకుండా ప్రతిరోజు వాకర్లు, విద్యార్థులు ఆటలు ఆడుతుంటారు. పోలీసు శిక్షణ తీసుకునే మాలాంటి వారికి ఇక్కడ సాధన సాధ్యం కావడం లేదు. గతంలో జరిగిన పరీక్షలో ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాను. ఈ సారి కష్టపడుతున్నా.

– యాసిన్, విఠల్‌నగర్, చీరాల

30న జాబ్ మేళా

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ఐసీ, డక్స్ బిజినెస్ సొల్యూషన్, ఆక్రో సాఫ్ట్ సొల్యూషన్ కంపెనీల ప్రతినిధులు వందకు పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్హతను బట్టి వేతనం రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీ చదివిన 18 – 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆసక్తి గల వారు తమ బయోడేటా, విద్యా సర్టిఫికెట్‌లు, ఆధార్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 90323 84374 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు.

47,832 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,094 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,832 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,400 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది.

ఉత్తరాఖండ్ డిఫెన్స్ లిక్కర్ స్వాధీనం

- దుస్తుల దుకాణం పేరుతో పార్శిల్లో దిగుమతైన మద్యం
- 70 సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): దుస్తుల దుకాణం పేరుతో పార్సిల్‌లో ఉత్తరఖండ్ నుంచి డిఫెన్స్ మద్యాన్ని గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడి గ్రామంలో అధిక ధరలకు అమ్మేందుకు తీసుకువెళుతున్న ఆర్మీ రిటైర్డ్ హవల్దార్‌ను, అతనితోపాటు మరొక వ్యక్తిని, ఒక ఆటోను, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇ.మారయ్యబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు ఎక్సైజ్–2 స్టేషన్‌లో పోలీసులు నిందితుల వివరాలు వెల్లడించారు. వడ్లమూడి గ్రామానికి చెందిన బాలాజీబాబు సింహాద్రి ఆర్మీ హవాల్దార్‌గా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పని చేసి రిటైర్ అయ్యాడు. అక్కడ ఉన్న పరిచయాలతో డిఫెన్స్ మద్యాన్ని పార్సిల్ రూపంలో గుంటూరుకు తీసుకువచ్చి వడ్లమూడిలో అమ్ముతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉత్తరాఖండ్ నుంచి గుంటూరుకు దుస్తుల దుకాణం పేరుతో ఒక పార్శిల్‌లో తీసుకొచ్చి ఇక్కడి నుంచి ఆటోలో వడ్లమూడికి తరలిస్తున్నారన్న సమాచారంతో తెల్లవారుజామున దాడి చేసి బాలాజీబాబు సింహాద్రి, బొలగాని వెంకటేశ్వరరావును అరెస్టుచేసినట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 750 ఎంఎల్ పరిమాణం గల 70 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ యశోధర దేవి, ఎస్ఐ కె.సత్యనారాయణ, సిబ్బంది హనుమంతరావు, ఎం.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, ఎస్‌వీవీ ప్రసాద్, జి.రవిబాబు, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: గిరిజన ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. గిరిజనుల ప్రత్యేక సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు తీర్చాలని సూచించారు. కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆయన ఆదేశించారు. ప్రజా సమస్యలపై 16 మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారుల నిర్లక్ష్యంతో అర్జీలు మళ్లీ మళ్లీ వస్తున్నాయని పేర్కొన్నారు. తర్వాత దశలో పైస్థాయి అధికారికి అర్జీలు వెళతాయని, అప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారంపై ఆయన ఆరా తీశారు. రిమార్కులు కూడా నమోదు చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్‌లు, ఇతర జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

31న పింఛన్లు పంపిణీ చేస్తాం

బాపట్ల: జనవరి నెలకు సంబంధించిన పింఛన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు 30వ తేదీన నగదు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 31న వందశాతం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారుల లాగిన్‌లో ప్రతి అర్ధగంటకు ఒకసారి పింఛన్ల పంపిణీ తీరును పర్యవేక్షించాలన్నారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడాలని సూచించారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలకు జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో ఇంటర్వ్యూలు జరిగాయి. వన్ స్టాప్ సెంటర్‌లో 4, డీసీపీయూలో 2, బాలసదన్‌లో మూడు పోస్టులకు 90 మంది పోటీ పడగా, వారికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, మహిళ శిశు సంక్షేమశాఖ పీడీ ఉమా తదితరులు పాల్గొన్నారు.

హైవే భూముల పరిశీలన

పర్చూరు (చినగంజాం): వాడరేవు – పిడుగురాళ్ల రహదారి నిర్మాణం కోసం సేకరించిన రైతుల భూములను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి శుక్రవారం పరిశీలించారు. పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి హైవే నిర్మాణం కోసం తమ భూములను తీసుకొని నష్టపరిహారం చెల్లించలేదని ఫిర్యాదు చేయడంతో ఆయన వివరాలు తెలుసుకున్నారు.

అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలో ఈ ఏడాది 99 కేసులు నమోదు కాగా, 86 కేసులకు ఎఫ్ఐఆర్ నమోదయిందన్నారు. 85 కేసులకు చార్జిషీట్ వేయగా, 86 కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. ఈ కేసులకు రూ.45.25 లక్షలు పరిహారం కింద బాధిత కుటుంబాలకు చెల్లించాల్సి ఉందని, ప్రస్తుతం నిధుల కొరత ఉందన్నారు. ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాలలో రూ.రెండు కోట్ల నిధులతో ఇన్వర్టర్లను ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఎస్సీ ఉద్యోగుల సమగ్ర వివరాలు ఇవ్వాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె రాజాదెబోరా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు, తుపాకుల సురేష్, గళ్ళ నాగమణి, పందుగుల ప్రసాద్, ఎన్జీవో ప్రతినిధి షేక్ పఠాన్ మహమ్మద్ ఖాన్, ఆర్డీవోలు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లక్ష్మీనారాయణ కుంకుమ పూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



మాట్లాడుతున్న శ్రీఅష్టాక్షరీ జీయర్‌స్వామి

తెనాలి: శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఇక్కడ జరుగుతున్న శ్రీధనుర్మాస వ్రత ప్రయుక్త దీక్షా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీనారాయణ కుంకుమ పూజను నిర్వహించారు. మహిళా భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీఅష్టాక్షరీ జీయర్‌స్వామి మాట్లాడుతూ మానవజన్మ అత్యున్నతమైనదని చెప్పారు. ఈ జన్మను సార్థకం చేసుకోవటానికి గోదాదేవి వ్రతం విశిష్టమైనదని చెప్పారు. శ్రీశరణాగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనరేంద్రరామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణ లో ఆర్టీసీ బస్‌స్టేషను–వీఏస్సార్ కాలేజి రోడ్డులో ఈ వేడుకలు జరుగుతున్న విషయం తెలిసిందే. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

పారదర్శకంగా నిర్వహిస్తాం

- అర్హత సాధించిన 9,084 అభ్యర్థులు
- పురుషులు 7,483, స్త్రీలు 1,601



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) చేపట్టిన ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్ పరీక్ష (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (పీఈటీ) పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 30 నుంచి వచ్చేనెల 22 వరకు జరపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కేటాయించిన నిర్ణీత వేళలు ఉదయం ఐదు గంటల నుంచి పది గంటలులోపు గ్రౌండ్‌కు రావాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 9,084 మంది దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించగా, అందులో 7,483 మంది పురుషులు, 1,601 మంది స్త్రీలు ఉన్నారని వివరించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన, బయోమెట్రిక్ ఆథెంటిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు(ఛాతీ, ఎత్తు కొలత), ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్), వెరిఫికేషన్ – 2 (స్పెషల్ బెనిఫిట్స్ – లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు ప్రతి స్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అంబులెన్స్, వైద్యులను అందుబాటులో ఉంచనున్నట్టు వివరించారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తాడేపల్లిరూరల్ : మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి చెప్పారు. శుక్రవారం ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో పడవలరేవు వద్ద కృష్ణా మీనోత్సవంలో భాగంగా నదిలో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీకుమారి, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేవుడు, తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య అధికారులతో కలసి నదిలో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 12.50 లక్షల చేపపిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో నిడుబ్రోలు ఎఫ్‌డీవో ఎం.డి.జయినుల్లా ఖాన్, గుంటూరు ఎఐఎఫ్ అధికారి కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలవగా, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై డి ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం..మాచవరం మండలం రుక్మిణిపురం గ్రామానికి చెందిన బాణావతు అశోక్ కుమార్ నాయక్(32) పాపాయపాలెం మూడు రోడ్ల కూడలి వద్ద జామకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో పాపాయపాలెం శివారులో పిడుగురాళ్ల నుంచి బైక్‌పై ఎదురుగా వస్తున్న వ్యక్తి అశోక్‌కుమార్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

విద్యుత్ సబ్‌స్టేషన్ గేటుకు తాళాలు

- ఇనుప వైర్లతోనూ గేట్లు కట్టేసిన వైనం
- అధికారుల అత్యుత్సాహం
- వైఎస్సార్ సీపీ శ్రేణులు వస్తున్నారని దుశ్చర్య
- డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వకుండా చేసేందుకు పన్నాగం
- స్థానికులు ప్రశ్నించడంతో తాళాలు తీసిన సిబ్బంది
- కూటమి నేతల ప్రసన్నం కోసమేనని విమర్శలు



ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషనుకు మెయిన్ గేట్ మూసి వేసి తాళాలు వేయించిన అధికారులు

ప్రత్తిపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మెయిన్ గేటుకు తాళాలు వేయించి విద్యుత్‌శాఖ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ అధికారీ వ్యవహరించని విధంగా వ్యవహరించి విమర్శలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ పోరుబాటకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు నిరసన ర్యాలీగా సబ్ స్టేషన్‌కు బయల్దేరారు. విషయం తెలుసుకున్న ఏఈ గౌతమ్ తమ సిబ్బందితో విద్యుత్ సబ్ స్టేషన్ మెయిన్ గేట్‌కు తాళాలు వేయించారు. ఎవరూ లోపలకు రాకుండా ఇనుప వైర్లతో గేట్లు కట్టి వేశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, మీడియా ప్రతినిధులు గేట్లుకు తాళాలు వేసి ఉండడంతో అవాక్కయ్యారు. స్థానికులు సిబ్బందిని ప్రశ్నించడంతో ఏఈ తాళాలు వేయమన్నారని చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో సిబ్బంది హడావుడిగా వచ్చి తాళాలు తీశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్లతో కూడిన పత్రం ఇవ్వడానికి వస్తున్నందునే ఇలా తాళాలు వేశారని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. కూటమి నాయకుల మెప్పు పొందడంతోపాటు వారి కళ్లలో ఆనందం చూసేందుకే విద్యుత్ అధికారులు ఇలా కార్యాలయానికి గతంలో ఎన్నడూ లేని విధంగా తాళాలు వేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి.

రేపు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకోవాలని కోరుతూ ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరులోని ఎన్జీఓ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ఉద్యోగ, కార్మిక సంఘాల గొంతుకగా పనిచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, సలీం, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ చిష్టీ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, యూటీఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్ రావు, జి.వెంకటేశ్వరరావు, ప్రేమ్ కుమార్, ఆదినారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు జి.వెంకట్రావు పాల్గొన్నారు.